పాఠం 22

# పౌరులు, ప్రభుత్వాలు

## భాగం - I : సమాచార హక్కు చట్టం

*గట్టు శ్వేతది కరీంనగర్ జిల్లా, మానకొండూరు మండలం. ఆమె కాకతీయ విశ్వవిద్యాలయంలో ఎంఎస్‌సి చదువుతూ ఉండేది. సమాచార హక్కు చట్టం (సహ చట్టం)సహకారంతో ఆమె బిఎస్‌సి డిగ్రీ పూర్తిచేసింది.*



*శ్వేత బిఎస్‌సి చివరి సంవత్సరం పరీక్షలు 2011 మార్చిలో రాసింది. ఒక్క రసాయన శాస్త్రంలో 21 మార్కులు తప్పించి మిగిలిన అన్ని విషయాల్లో ఆమెకు మంచి మార్కులు వచ్చాయి. దీంట్లో తక్కువ మార్కులు ఎందుకు వచ్చాయో ఆమెకు అర్థం కాలేదు. ఆమె బాగా కష్టపడి చదివి జూన్‌లో ఇన్‌స్టెంట్ పరీక్ష రాసింది. ఈసారి ఆమెకు 9 మార్కులే వచ్చాయి. పరీక్షలలో బాగా రాసినా తనకు తక్కువ మార్కులు ఎందుకు వస్తున్నాయో ఆమెకు అర్థం కాలేదు. కాకతీయ విశ్వవిద్యాలయానికి వెళ్లి తన పరీక్ష పత్రాన్ని మళ్లీ మూల్యాంకనం చెయ్యవలసిందిగా ఆమె దరఖాస్తు పెట్టుకుంది. కానీ ఆమె విన్నపాన్ని విశ్వవిద్యాలయం తిరస్కరించింది. ఈలోగా శ్వేత ఎంఎస్‌సి ప్రవేశ పరీక్షలో ఉత్తీర్ణురాలయ్యింది. అయితే బిఎస్‌సిలో రసాయన శాస్త్రం పరీక్షలో ఉత్తీర్ణురాలు అయితే తప్పించి విశ్వవిద్యాలయం ఆమెను ఎంఎస్‌సిలో చేర్చుకోనంది.*

*అప్పుడు ఆమె సమాచార హక్కు కార్యకర్తలను సంప్రదించి తన జవాబు పత్రం ఫొటోకాపీ కోరుతూ దరఖాస్తు చేసుకుంది. విశ్వవిద్యాలయ అధికారులు ఫొటోకాపీ ఇవ్వటానికి నిరాకరించారు. ఎంఎస్‌సిలో చేరే తేదీ దగ్గర పడుతుండటంతో ఆమె రాష్ట్ర సమాచార అధికారి దగ్గరకు వెళ్లి విశ్వవిద్యాలయ పౌర సమాచార అధికారి జవాబు పత్రం ఇవ్వకపోవటంపై విన్నవించుకుంది. జవాబుపత్రం నకలును ఆమెకు ఇవ్వవలసిందిగా విశ్వవిద్యాలయ అధికారులకు రాష్ట్ర సమాచార కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు. అప్పుడు తిరిగి మూల్యాంకనం చేసి ఆమెకు మార్కుల పత్రం పంపించారు. ఈసారి ఆమెకు 51 మార్కులు వచ్చి పరీక్షలో ఉత్తీర్ణురాలయ్యింది, దాంతో ఎంఎస్‌సిలో చేరగలిగింది.*

సమాచార హక్కు చట్టం వంటిది లేనట్లయితే శ్వేతకు న్యాయం జరిగి ఉండేది కాదు. అంతకు ముందు విద్యార్థులకు మార్కులు తప్పించి జవాబు పత్రం పొందే అవకాశం ఉండేది కాదు. కాబట్టి ప్రతి జవాబుకు మార్కులు సరిగ్గా వేశారో లేదో చూసుకునే వీలు విద్యార్థులకు ఉండేది కాదు.

సమాచార హక్కు చట్టం, 2005ను కేంద్ర ప్రభుత్వం ఆమోదించిన విషయం మీరు ఎనిమిదవ తరగతిలో చదివారు. ప్రజల ఉద్యమం కారణంగా, పౌరులకు హక్కులను కల్పిస్తున్న రాజ్యాంగంలోని అంశాల కారణంగా ఈ చట్టం రూపొందింది. సహ చట్టం ప్రయోజనాలు ప్రజలకు అందాలంటే నిర్వర్తించాల్సిన రెండు పాత్రల గురించి ఈ పాఠంలో క్లుప్తంగా తెలుసుకుందాం. మొదటి పాత్ర ప్రభుత్వ శాఖలది, రెండవ పాత్ర పౌరులది. ఏ ప్రజాస్వామిక వ్యవస్థలోనైనా ప్రభుత్వాలు ప్రజలకు బాధ్యత వహించి వారికి జవాబుదారీగా ఉండాలి. అంతకు ముందు ప్రభుత్వ శాఖలు, వాటి సిబ్బంది జవాబుదారీతనం ప్రధానంగా ఎన్నికైన ప్రజాప్రతినిధులకు పరిమితమై ఉండేది. ప్రభుత్వ శాఖలో ఉత్పన్నమయ్యే సమాచారంలో ఏ పౌరుడు ఆసక్తి చూపించినా వారికి అందచేయటం ఇప్పుడు ప్రభుత్వ శాఖల బాధ్యత అవుతుంది.

## సమాచారం అంటే ఏమిటి?

ప్రతి ప్రభుత్వశాఖ కొన్ని నియమ, నిబంధనల ఆధారంగా పని చేస్తుంది. ఉదాహరణకు ఆరోగ్య శాఖలో ఆసుపత్రిలో డాక్టర్లు, నర్సుల ఎంపిక, నియామకం, బదిలీలకు సంబంధించి లేదా మందుల కొనుగోలు, పంపిణీలకు సంబంధించి నియమ, నిబంధనలు ఉంటాయి. రెవెన్యూ శాఖలో భూమి రికార్డులకు సంబంధించిన నియమాలు ఉంటాయి, లేదా విద్యాశాఖలో పాఠశాలలు పుస్తకాలు కొనటానికి, మధ్యాహ్న భోజనాలు పెట్టటానికి, వసతిగృహ సదుపాయాలు కల్పించటానికి, ఉపాధ్యాయుల సెలవులకు, క్రీడా మైదానానికి డబ్బు పోగుచెయ్యటం వంటి వాటికి నియమాలు ఉంటాయి. ఈ పరిస్థితులన్నింటిలో కొన్ని నియమాలను పాటించాలి, కొన్ని రికార్డులను నిర్వహించాలి, తీసుకున్న నిర్ణయాల వివరణ ఉండాలి. వీటి కారణంగా వ్యవస్థలో అనేక రాత పత్రాలు రూపొందుతాయి. సమాచార హక్కు చట్టంలో పేర్కొన్నట్టు ఇవి అనేక రూపాలలో ఉండవచ్చు:

"రికార్డులు, డాక్యుమెంట్లు, మెమోలు, ఈ-మెయిల్స్, అభిప్రాయాలు, సలహాలు, పత్రికా ప్రకటనలు, సర్క్యులర్లు, ఆదేశాలు, లాగ్ పుస్తకాలు, ఒప్పందాలు, నివేదికలు, పత్రాలు, నమూనాలు, మోడల్స్ వంటి రూపాలలో ఉన్న మెటీరియల్, ఏ ఎలక్ట్రానిక్ రూపంలోనైనా ఉన్న గణాంకాలు, అమలులో ఉన్న ఇతర చట్టాల కింద ప్రభుత్వ అధికారి అనుమతి పొందిన ప్రైవేటు సంస్థకు సంబంధించిన సమాచారం,"

ఈ సమాచారంలో పౌరులు ఏం చెయ్యగలుగుతారన్నది కీలకమైనది. ఒక శాఖ పని చెయ్యటంలో అవకతవకలు జరిగాయన్న అనుమానం ఉందని అనుకుందాం, ఏ వ్యక్తులైనా సమాచారాన్ని సేకరించి అవలంబించిన విధానాన్ని సవాలు చెయ్యవచ్చు. సమాచార హక్కు చట్టం లేకముందు విద్యాశాఖ యూనిఫారంను ఎలా పంచి పెట్టిందో, లేదా ఆరోగ్య శాఖ మందులను ఎలా కొనుగోలు చేసిందో తెలుసుకునే అవకాశం లేదు. ఆ శాఖలోని పై అధికారులు, లేదా మంత్రి మాత్రమే ఆ వివరాలను తీసుకుని, తనిఖీ చెయ్యగలిగి ఉండేవాళ్లు.

సమాచార హక్కు చట్టం వల్ల ఇప్పుడు ప్రతి ప్రభుత్వ శాఖ రికార్డులను నిర్వహించి, వాటిని అడిగిన పౌరులకు అందుబాటులో ఉంచాలి. అంతేకాదు, పౌరులెవ్వరూ అడగకుండానే ప్రతి శాఖ తమకు సంబంధించిన కొన్ని వివరాలను స్వచ్ఛందంగా ప్రజలకు బహిర్గతం చెయ్యాలి. ఉదాహరణకు రోడ్లు

వేస్తుంటే, లేదా మరమ్మతు చేస్తుంటే ప్రజా పనుల శాఖ (PWD) ఆ ప్రాంతంలో ఒక బోర్డు పెట్టి ఎంత డబ్బు ఖర్చు పెట్టారు, లేదా ఎంత మంది కూలీలు పనిచేసారు, ఎన్ని రోజులలో పని పూర్తి చేశారు వంటి వివరాలను పొందు పరచాలి. దీని వల్ల మరింత పారదర్శకత ఏర్పడుతుంది.

- టీచరుకు హెడ్మాస్టారు ఇచ్చే మౌఖిక ఆదేశం సమాచారం కాకపోవటానికి కారణం ఏమిటో చర్చించండి.
- సిఫారసు చేసిన విధంగా నియమ, నిబంధనలను పాటించినట్లయితే ప్రభుత్వ శాఖలు మరింత జవాబుదారీతనాన్ని ఎలా కనబరుస్తాయో ఊహించండి.

## ఎవరు బాధ్యులు

పైన వివరించిన దానిని బట్టి ఇటువంటి చట్టాన్ని అమలు చెయ్యటానికి ఒక నిర్మాణం అవసరం అని అర్థమవుతోంది. ఎనిమిదవ తరగతిలో చదివినట్టు మీ ప్రభుత్వ పాఠశాలతో సహా ప్రతి ప్రభుత్వశాఖలో ఒక పౌర సమాచార అధికారి ఉంటారు, అదే శాఖలో ఒక అప్పీలేట్ అధికారి ఉంటారు, అన్ని శాఖల పౌర సమాచార అధికారులు, అప్పిలేట్ అధికారులు రాష్ట్ర పౌర సమాచార కార్యాలయానికి జవాబుదారీగా ఉంటారు, దీనికి రాష్ట్ర సమాచార కమిషనర్లు ఉంటారు. ఏదైనా ప్రభుత్వశాఖ కేంద్ర ప్రభుత్వం కిందికి వస్తే కేంద్ర సమాచార కమిషనర్లతో కూడిన కేంద్ర సమాచార కార్యాలయానికి జవాబుదారీగా ఉంటారు. ప్రధాన ఎన్నికల కమిషనరు, న్యాయవ్యవస్థ మాదిరి ఈ సమాచార కార్యాలయాలు స్వయంప్రతిపత్తి కలిగి ఉంటాయి.

ఒక ఉదాహరణ ద్వారా దీనిని అర్థం చేసుకోటానికి ప్రయత్నిద్దాం. మీరు ఒక గ్రామంలో ఉంటున్నారని అనుకుందాం. మీ గ్రామంలో వేసిన రోడ్డుకి ఎంత ఖర్చు అయ్యిందో తెలుసుకోవాలని మీరు అనుకున్నారు. PWD మండల లేదా జిల్లా కార్యాలయంలో సమాచారం కోసం మీరు దరఖాస్తు చేయవచ్చు. మీరు PWD జిల్లా కార్యాలయంలో దరఖాస్తు చేసే మండల శాఖ ద్వారా సమాచారం పొందమని వాళ్లు బదులు ఇవ్వటానికి లేదు. ఒకవేళ మీరు PWD మండల కార్యాలయంలో దరఖాస్తు చేస్తే ఈ సమాచారాన్ని జిల్లా కార్యాలయం నుంచి తీసుకొమ్మని చెప్పటానికి లేదు. ఒకవేళ ఈ సమాచారం వాళ్ల దగ్గర లేకపోతే సమాచారం ఉన్న అధికారి నుంచి సమాచారం పొంది దానిని అందచేయటం వాళ్ల బాధ్యత.

ఒకవేళ సమాచార అధికారులు ఇద్దరూ మీ దరఖాస్తుకు జవాబు ఇవ్వలేదని అనుకుందాం. అప్పుడు ఏం చెయ్యాలి? ఇక్కడ రాష్ట్ర, కేంద్ర సమాచార కమిషనర్ల పాత్ర ప్రాధాన్యతను సంతరించుకుంటుంది. PWD లోని పౌర సమాచార అధికారులు వీటికి జవాబుదారీగా ఉంటారు. అవసరమైతే రాష్ట్ర, కేంద్ర సమాచార కమిషనర్లు సంబంధిత పౌర సమాచార అధికారికి జరిమానా విధించవచ్చు.

అయితే ఆయా శాఖల పనిలో చట్టాలను ఉల్లంఘిస్తే చర్య తీసుకునే బాధ్యత సమాచార అధికారులకు ఉండదని గుర్తుంచుకోవాలి. ఈ అధికారం దేశంలోని న్యాయస్థానాలకే ఉంటుంది. అయితే నిర్దేశిత సమయంలోపు, సరైన సమాచారం ఇచ్చేలా రాష్ట్ర, కేంద్ర సమాచార కమిషనర్లు చూడవచ్చు. ఒకవేళ ఎవరైనా పౌర సమాచార అధికారి సమాచారాన్ని ఇవ్వటానికి తిరస్కరిస్తే రాష్ట్ర, కేంద్ర సమాచార కమిషనర్ల ఆదేశాల మేరకు వాళ్లను శిక్షించవచ్చు.

సమాచార హక్కు చట్టం కిందికి వచ్చే ప్రభుత్వ సంస్థలను చట్టం ఈ కింది విధంగా గుర్తించింది: అ) రాజ్యాంగం కింద ఏర్పడిన సంస్థ; ఆ) పార్లమెంటు, లేదా రాష్ట్ర శాసన సభల ప్రకారం ఏర్పడిన సంస్థ; ఇ) సంబంధిత ప్రభుత్వ ఆదేశాలు లేదా నోటిఫికేషన్ ద్వారా ఏర్పడిన సంస్థ. ప్రభుత్వ సంస్థ, ప్రభుత్వ నియంత్రిత సంస్థ, ప్రభుత్వం నిధులు సమకూర్చిన సంస్థలు ఈ చట్టంకిందికి వస్తాయి. ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా గణనీయ మొత్తంలో ప్రభుత్వ నిధులు అందే స్వచ్ఛంద సంస్థలు కూడా ఈ చట్టంకిందికి వస్తాయి.

సమాచార హక్కు చట్టం, 2005 ప్రకారం ప్రభుత్వ సంస్థలు అ) కంప్యూటరైజ్డ్ రూపంలో సమాచారాన్ని భద్రపరచాలి, ఆ) దానికి సంబంధించిన సమాచారాన్ని ముందస్తుగానే వెల్లడి చెయ్యాలి. సమాచార హక్కు చట్టం ఇలా పేర్కొంటోంది:

(1) ప్రతి ప్రభుత్వ సంస్థ: అ) తనకు సంబంధించిన అన్ని రికార్డులను .... ఇటువంటి రికార్డులను తేలికగా బయటకు తీయటానికి వీలుగా వర్గీకరించి, సూచికలతో నిర్వహించాలి.

ఆ) ప్రతి సంస్థ ఈ దిగువ సమాచారాన్ని ప్రచురించాలి

(i) సంస్థ వివరాలు, విధులు, బాధ్యతలు;

(ii) సంస్థలోని అధికారులు, ఉద్యోగస్తుల అధికారాలు, విధులు;

(iii) నిర్ణయాలు తీసుకోవటంలో అనుసరించే విధానం, పర్యవేక్షణ, జవాబుదారీ విధానాలను కూడా పేర్కొనాలి;

(v) సంస్థకు ఉండే లేదా దాని నియంత్రణలో ఉండే లేదా తమ విధులను నిర్వర్తించటంలో ఉద్యోగస్తులు ఉపయోగించే నియమాలు, నిబంధనలు, ఆదేశాలు, మార్గదర్శకాలు, రికార్డులు.

.....

(viii) సలహా ఇవ్వటం కోసం ఏర్పాటు చేసి ... ఇద్దరు లేదా అంతకంటే ఎక్కువ సభ్యులు ఉన్న బోర్డులు, సమితులు, సంఘాలు, ఇతరాల వివరాలు;

(ix) ఆ కార్యాలయంలోని అధికారులు, ఉద్యోగస్తుల వివరాలు;

(x) అధికారులు, ఉద్యోగస్తులకు ఇస్తున్న నెలసరి జీతం, నియమాల ప్రకారం చేసే ఇతర చెల్లింపులు;

(xi) తన ప్రతి ఒక్క ఏజెన్సీకి కేటాయించిన బడ్జెటు;

(xii) సబ్సిడీ పథకాల అమలు విధానం దానికి కేటాయించిన నిధులు....

(xiii) దాని ద్వారా రాయితీలు, పర్మిట్లు, లేదా అధీకృత పత్రాలు పొందిన వాళ్ల వివరాలు;

....

(xvi) పౌర సమాచార అధికారుల పేర్లు, హోదాలు, ఇతర వివరాలు.

ఇ) ముఖ్యమైన విధానాలు రూపొందించేటప్పుడు లేదా ప్రజలను ప్రభావితం చేసే నిర్ణయాలను ప్రకటించేటప్పుడు సంబంధిత అన్ని వాస్తవాలను వెల్లడి చేయాలి.

ఈ) ప్రభావిత వ్యక్తికి పరిపాలన సంబంధ లేదా న్యాయ స్వరూపం గల నిర్ణయాలకు కారణాలను తెలియచెయ్యాలి.

2) పై సమాచారమంతటినీ ఎవరూ అడగకుండానే ప్రభుత్వ సంస్థలు వెల్లడి చేయాలి.

3) ఇది అందరికీ తేలికగా అందుబాటులో ఉండాలి.

4) ఇది స్థానిక భాషలో ఉండాలి; దీనికి ఏదైనా డబ్బు చెల్లించాల్సి ఉంటే అది ప్రజలకు భారం కాకుండా ఉండాలి.

## సమాచారం వెల్లడి చెయ్యటానికి మినహాయింపులు

దీని అర్థం ప్రభుత్వ శాఖలకు సంబంధించిన అన్ని వ్యవహారాలపై ప్రజల నిఘా ఉండాలని కాదు. కొంత సమాచారాన్ని ప్రభుత్వం వెల్లడి చెయ్యకుండా ఉండే అవకాశాన్ని చట్టం కల్పిస్తోంది. ఇలా మినహాయించిన కొన్ని అంశాలు:

- భారతదేశ సార్వభౌమత్వం, సమగ్రతలను ప్రభావితం చేసే సమాచారం, విదేశీ శక్తుల సందర్భంలో కీలక ఆర్థిక, శాస్త్రీయ ప్రయోజనాలు కలిగి ఉండే అంశాలు.
- పార్లమెంటు లేదా రాష్ట్ర శాసన సభల హక్కులకు భంగం కలిగించే సమాచారం.
- గోప్యంగా ఉంచుతారన్న భావనతో విదేశ ప్రభుత్వాల నుంచి అందిన సమాచారం.
- ఒక వ్యక్తి జీవితానికి లేదా భౌతిక భద్రతకు భంగం కలిగించే సమాచారం.
- (అంతిమ నిర్ణయం తీసుకోవడానికి ముందు) మంత్రుల లేదా సెక్రటరీల బృందం ముందు ఉంచే కేబినెట్ పత్రాలు లేదా రికార్డులు.

మన సైనిక దళాలు, భద్రతా సంస్థలు చాలా వరకు సమాచార కమిషన్ల పరిధిలోకి రావు.

ఈ చట్టంలో మార్పులు ఎవరు చేయవచ్చు? ఈ చట్టం చేసిన తరువాత దీనిలోని పలు అంశాలను అనేక సందర్భాలలో వివిధ శాఖలు ప్రశ్నించాయి. అవసరమనిపిస్తే ఈ చట్టానికి పార్లమెంటు సవరణలు చేయవచ్చు, అయితే రాజ్యాంగం అర్థం చేసుకుని నిర్వచించిన దానికి మద్దతుగా, సమాచారానికి ఉన్న మౌలిక హక్కుకు భంగం కలిగించేలా ఇది ఉండకూడదు.

- ఈ చట్టం ప్రకారం ఏ సమాచార అధికారి అయినా సమాచారం ఇవ్వకపోతే వాళ్లు జరిమానా చెల్లించాల్సి ఉంటుంది. మీరు దీనితో ఏకీభవిస్తారా? ఎందుకని?
- ఏ రకమైన సమాచారం ప్రజలకు అందుబాటులో లేదు? దీనికి మద్దతు తెలిపిన వాదన ఏది?

## సమాచార హక్కు, ప్రజలు


సమాచార హక్కు చట్టం నేపథ్యంలో ప్రజలకు ఎటువంటి పాత్ర ఉందో, దానిని ఎలా పోషించాలో క్లుప్తంగా తెలుసుకుందాం. ప్రస్తుతం ఏ పౌరుడైనా ప్రభుత్వానికి సంబంధించి ఏ శాఖలోనైనా రికార్డు రూపంలో ఉండే సమాచారం కావాలని అడగవచ్చు. ఆ సమాచారం తనకు ఎందుకు కావాలో వివరించాల్సిన అవసరం లేదు. సమాచారం కావాలన్న విన్నపాన్ని చేతితో రాసిన ఉత్తరం రూపంలోకానీ ఎలక్ట్రానిక్ మెయిల్ రూపంలోకానీ ఇవ్వవచ్చు. సమాచారాన్ని ఆ రాష్ట్ర అధికార భాషలోకానీ, లేదా ఇంగ్లీషులోకానీ, లేదా హిందీలోకానీ ఇవ్వవచ్చు. ఒకవేళ ఒక వ్యక్తి ఉత్తరం రాయలేకపోతే పౌర




చిత్రం 22.1 : సమాచార హక్కు చట్టం పై ప్రదర్శన

సమాచార అధికారి లేదా రాష్ట్ర పౌర సమాచార అధికారి వద్ద మౌఖికంగా చెప్పటం ద్వారా కూడా దరఖాస్తు ఇవ్వవచ్చు. సమాచారాన్ని సేకరించే వ్యక్తి తాను ఎవరో తెలియ చేయాల్సిన అవసరం లేదు. అయితే సమాచారం పంపించటానికి పోస్టల్ చిరునామా అందచేయాలి. సమాచారాన్ని పొందటానికి పౌరులు నామమాత్రమైన రుసుమును చెల్లించాల్సి ఉంటుంది, ఇది ఎక్కడి కార్యాలయం అనేదాన్ని బట్టి 5–10 రూపాయల మధ్య ఉంటుంది. సమాచారం కోరుతున్న వ్యక్తి దారిద్ర్య రేఖకు దిగువన ఉంటే అతను/ ఆమె ఈ రుసుము చెల్లించనవసరం లేదు. కాబట్టి ఈ చట్టం అనేక విధాలుగా అందరికీ సమాచారం అందుబాటులో ఉండేలా చేసింది.

*కింద ఇచ్చిన వార్తాకథనాలను చదివి సమాచార హక్కు ఉపయోగం గురించి చర్చించండి.*



ప్రజాస్వామ్యానికి అన్ని విషయాలు తెలిసిన పౌరులు కావాలి, సమాచారంలో పారదర్శకత ఉండాలి. ఇది అవినీతిని అరికట్టటానికి దోహదపడుతుంది, ప్రభుత్వాలు ప్రతిఒక్క పౌరునికి జవాబుదారీగా ఉంటాయి. ఇంతకు ముందు మాదిరి ప్రభుత్వ శాఖలు కేవలం ఎన్నికైన ప్రజాప్రతినిధులకే స్పందించటం కాకుండా ఇప్పుడు అవి సాధారణ పౌరులకు కూడా సమాధానాలు చెప్పవలసి ఉంటుంది, అంటే వాళ్లకు కూడా జవాబుదారీగా ఉండాలి.

## భాగం - II : న్యాయ సేవా ప్రాధికార సంస్థ

- కోర్టు ఫీజులు, ఇతర ఖర్చులు భరించలేని పేద ప్రజలకు మన దేశంలో ఉచిత న్యాయ సేవలకు ఎటువంటి అవకాశాలు ఉన్నాయి?
- ఉచిత న్యాయ సేవల ద్వారా ఎటువంటి కేసులు, తగాదాలను చేపట్టవచ్చు?
- కోర్టుల బయట తగాదాల పరిష్కారానికి ప్రత్యామ్నాయ విధానం ఏదైనా ఉందా?

ప్రజలకు ఉచిత న్యాయ సేవలు అందించటానికి మన దేశంలో ఒక విధానం ఉంది. న్యాయ సేవల ప్రాధికార సంస్థ (సవరణ) చట్టం, 2002 ప్రకారం సమాజంలోని బలహీన వర్గాలకు ఉచిత న్యాయ సేవలు అందించటానికి న్యాయ సేవా పీఠాలను ఏర్పాటు చేస్తారు. ఆర్థిక లేక ఏ ఇతర కారణాల వల్ల నైనా ఏ పౌరుడికి కూడా న్యాయం లభించకుండా ఉండకూడదన్న ఉద్దేశంతో వీటిని ఏర్పాటు చేశారు. దీనివల్ల న్యాయ వ్యవస్థ సమాన అవకాశాల ప్రాతిపదికన అందరికీ న్యాయాన్ని అందిస్తుంది.

గ్రామాలలో ప్రజల తగాదాలను తీర్చడానికి అన్ని విషయాలను, అంశాలను గ్రామ / తెగ పెద్దల ముందు చర్చించి ప్రశాంతంగా అందరికీ ఆమోదయోగ్యంగా పరిష్కరించటం మన దేశంలో అనాదిగా జరుగుతోంది. తగాదాలు, వివాదాల స్వభావం, వాటి మూలాలు సాధారణంగా స్థానిక ప్రజలకు, గ్రామ పెద్దలకు తెలుస్తాయి. దీనివల్ల ఆ తగాదాలను / వివాదాలను గ్రామ ప్రజలు చర్చించటానికి వీలు కలిగి, పారదర్శక పద్ధతిలో అందరికీ ఆమోదయోగ్య పరిష్కారాన్ని కనుగొనటం సాధ్యమవుతుంది. న్యాయ సేవల పీఠాల చట్టం 1987 ని 1994లోనూ, తిరిగి 2002 లోనూ సవరించారు. దీనికింద లోక్ అదాలత్‌లను (ప్రజా న్యాయ పీఠాలను) ప్రతి రాష్ట్రంలోనూ ఏర్పాటు చేశారు.

ఇప్పుడు వీటి ద్వారా న్యాయ కోవిదులు, అధికారులు, అనధికార ప్రముఖుల సమక్షంలో, సుహృద్భావ వాతావరణంలో, పరస్పర అంగీకారంతో తగాదాలు వివాదాలను పరిష్కారించుకోవచ్చు. ఖర్చు లేకుండా, త్వరితగతిన న్యాయం పొందటానికి ప్రజలు ఇప్పుడు లోక్ అదాలత్‌లను ఉపయోగించుకుంటున్నారు. కోర్టులలో దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న కేసులను ఎటువంటి ఖర్చు లేకుండా వెంటనే పరిష్కరించుకోటానికి లోక్ అదాలత్ సహాయ పడుతుంది. ఒకవేళ అప్పటికే కక్షదారులు కోర్టు రుసుము చెల్లించి ఉంటే అది కూడా వెనక్కి ఇస్తారు. తగాదాలు వివాదాల పరిష్కారానికి భారతదేశంలో అనాదిగా అమలులో ఉన్న విధానమే లోక్ అదాలత్ రూపాన్ని సంతరించుకుంది, ఆధునిక కాలంలోనూ దీని అవసరం, ఉపయోగం ఉంది.

- లోక్ అదాలత్‌ని మీరు సమర్థిస్తారా?

## న్యాయ సేవా ప్రాధికార సంస్థ ఉద్దేశాలు

- సమాజంలోని బలహీన వర్గాలకు ఉచిత, సమర్థ న్యాయ సేవలను అందించటానికి న్యాయసేవ ప్రాధికార సంస్థ చట్టాన్ని చేయడం.
- ఆర్థిక లేక ఏ ఇతర కారణాల వల్ల నైనా ఏ పౌరునికీ న్యాయం అందని పరిస్థితి లేకుండా చూడడం.
- సమాన అవకాశాల ప్రాతిపదికన న్యాయాన్ని అందించేలా న్యాయ వ్యవస్థ పనిచేసేలా చూడటానికి లోక్ అదాలత్‌లను ఏర్పాటు చెయ్యటం.
- కోర్టుల బయట సమర్థ, ప్రత్యమ్నాయ, సృజనాత్మక వివాద పరిష్కార విధానాన్ని రూపొందించటం.

## న్యాయ సేవల ఏర్పాటు

ఈ చట్టం ప్రకారం న్యాయ సహాయం అందించటానికి దేశవ్యాప్తంగా ఒక న్యాయ వ్యవస్థను ఏర్పాటు చేశారు. దేశస్థాయిలో ఏర్పాటైన జాతీయ న్యాయ సేవల ప్రాధికార సంస్థ. ఈ చట్టంలో పొందుపరచబడిన అంశాల ప్రకారం న్యాయ సేవలు అందించటానికి విధివిధానాలను సూత్రాలను రూపొందిస్తుంది. న్యాయ సేవలకు తక్కువ వ్యయంతో సమర్థవంతమైన న్యాయ సేవలు అందించడానికి పథకాలను రూపొందిస్తుంది. న్యాయ సహాయ పథకాలు, కార్యక్రమాలను అమలు చేయటానికై స్వచ్ఛంద సంస్థలకు, రాష్ట్ర న్యాయ సేవా ప్రాధికార సంస్థలకు ఈ సంస్థ నిధులను అందజేస్తుంది.

ప్రతి రాష్ట్రంలోనూ రాష్ట్ర న్యాయ సేవల ప్రాధికార సంస్థ ఉంటుంది. జాతీయ స్థాయి సంస్థ రూపొందించిన విధి విధానాలను, ఆదేశాలను ఇది అమలు చేస్తుంది. రాష్ట్రంలోని ప్రజలకు న్యాయ సేవలను అందిస్తుంది. లోక్ అదాలత్‌లను నిర్వహిస్తుంది. రాష్ట్ర న్యాయ సేవల ప్రాధికార సంస్థకి అధిపతిగా, ప్యాట్రన్-ఇన్-చీఫ్‌గా రాష్ట్ర హైకోర్టు ఛీఫ్ జస్టిస్ ఉంటారు. పదవిలో ఉన్న లేదా పదవీ విరమణ చేసిన హైకోర్టు జడ్జిని దీనికి కార్యనిర్వాహక ఛైర్మన్‌గా నామినేట్ చేస్తారు.

న్యాయ సహాయ కార్యక్రమాలు, పథకాలను అమలు చెయ్యటానికి ప్రతి జిల్లాల్లో జిల్లా న్యాయ సేవల ప్రాధికార సంస్థను ఏర్పాటు చేశారు. ఆ జిల్లా జడ్జి దీనికి ఎక్స్ - అఫిషియో ఛైర్మన్‌గా ఉంటారు, ఇతర సభ్యులను రాష్ట్ర ప్రభుత్వం నామినేట్ చేస్తుంది.

ప్రతి మండలం లేదా కొన్ని మండలాలకు మండల లేదా తాలూకా, న్యాయ సేవల సంఘాలు ఉంటాయి. ఆ పరిధిలో లోక్ అదాలత్‌లను నిర్వహించటం, న్యాయ సేవా కార్యక్రమాలను సమన్వయం చేయటం దీని బాధ్యత. సంఘ పరిధిలో పని చేస్తున్న సీనియర్ సివిల్ జడ్జి మండల న్యాయ సేవల సంఘానికి అధిపతిగానూ, ఎక్స్-అఫిషియో ఛైర్మన్‌గానూ ఉంటారు.

## న్యాయ సేవల ప్రాధికార సంస్థల విధులు

**న్యాయాలు సేవల ప్రాధికార సంస్థ వివిధ స్థాయిలలో ఈ క్రింద పేర్కొన్న విధులను నిర్వర్తిస్తుంది.**

- చట్టంలో పొందుపరిచిన ప్రకారం అర్హులైన వ్యక్తులకు న్యాయ సేవలను అందించటం
- లోక్ అదాలత్‌లను నిర్వహించటం
- ముందస్తు నివారణ, వ్యూహాత్మక న్యాయ సహాయ కార్యక్రమాలను చేపట్టటం
- న్యాయ సేవల ప్రాధికార సంస్థ నిర్ణయించే ఇతర విధులను నిర్వర్తించటం.

### న్యాయ సేవల ప్రాధికార సంస్థ ద్వారా ఎటువంటి న్యాయ సహాయ సదుపాయాలు అందుతాయి?

లోక్ అదాలత్‌లద్వారా న్యాయ సేవల ప్రాధికార సంస్థ దీర్ఘకాలంగా కోర్టుల్లో ఉన్న కేసులను తక్కువ కాలంలో, ఎటువంటి ఖర్చు లేకుండా పరిష్కరిస్తుంది. వైవాహిక విభేదాలు, భరణానికి సంబంధించిన కేసులు, భర్త, అత్తవారింటి వేధింపులకు సంబంధించిన కేసులు, గృహ హింస కేసులు అన్ని రకాల సివిల్ కేసులు భూ వివాదాలు, చట్టరీత్యా రాజీకి అర్హమైన అన్ని రకాల క్రిమినల్ కేసులు వంటి వాటిని ఇది చేపట్టవచ్చు. ఈ విధమైన కేసులను ఎటువంటి రుసుములు, ఖర్చులు లేకుండా లోక్ అదాలత్‌ల ద్వారా అందరికీ ఆమోద యోగ్యరీతిలో శాశ్వతంగా పరిష్కరించుకోవచ్చు.

కోర్టులలో పెండింగ్‌లో ఉన్న కేసులలో ఇరు పార్టీలుకానీ లేదా ఏదైనా ఒక పార్టీ కానీ పరిష్కారం కోసం కేసును లోక్ అదాలత్‌కు బదిలీ చేయమని కోరుతూ కోర్టులో దరఖాస్తు చేసుకోవాలి. కేసు పరిష్కారానికి అవకాశం ఉందని సంతృప్తి చెందితే అప్పుడు సంబంధిత కోర్టు ఆ కేసును లోక్ అదాలత్‌కి పంపిస్తుంది.

వ్యాజ్యానికి వెళ్లకముందే అంటే కోర్టుకి వెళ్లటానికి ముందే వివాదాల పరిష్కారానికీ కక్షి దారులు సంబంధిత జిల్లా స్థాయి న్యాయ సేవాధికార సంస్థను గానీ లేదా రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థనుగానీ సంప్రదించవచ్చు.

## న్యాయ సేవల సంస్థ ద్వారా ఎవరు ప్రయోజనం పొందవచ్చు?

కింద పేర్కొన్న వ్యక్తులు ఉచిత న్యాయసహాయానికి అర్హులు:

1. షెడ్యూల్డ్ కులాలు లేదా షెడ్యూల్డ్ జాతులకు చెందిన వ్యక్తులు
2. మానవ అక్రమ రవాణా బాధితులు, బిక్షాటకులు
3. స్త్రీలు, పిల్లలు
4. మతి స్థిమితం లేనివారు లేదా అంగ వైకల్యం ఉన్నవారు
5. పెను విపత్తు, జాత్యాహంకార హింస, కుల వైషమ్యాలు, వరదలు, కరువులు, భూకంపాలు, పారిశ్రామిక విపత్తులకు గురైనవారు.
6. పారిశ్రామిక కార్మికులు
7. వ్యభిచార వృత్తి (నివారణ) చట్టం, 1956లో సెక్షన్ 2, క్లాజు (జి) ప్రకారం రక్షణ గృహం, లేదా బాల నేరస్తుల న్యాయ చట్టం, 1986లోని సెక్షన్ 2, క్లాజు (జె) ప్రకారం బాల నేరస్తుల గృహం

లేదా మానసిక ఆరోగ్య చట్టం 1987లో సెక్షన్ 2, క్లాజు (జి) ప్రకారం మానసిక వ్యాధి చికిత్సాలయం లేదా మానసిక రోగుల సంరక్షణాలయంలో నిర్బంధంలో ఉన్న వ్యక్తులు.

8. లక్ష రూపాయలలోపు వార్షిక ఆదాయం ఉన్న వ్యక్తులు.

పైన పేర్కొన్న వారిలో ఏ వ్యక్తులైనా సహాయం పొందటానికి అర్హులని సంబందిత న్యాయ మూర్తి సంతృప్తి చెందితే వారు తగిన న్యాయ సేవలు పొందవచ్చు.

## ఎవరికి ఎలా దరఖాస్తు చెయ్యాలి?

దీర్ఘకాలంగా పెండింగులో ఉన్న తమ వివాదాలు, తగాదాలు, కోర్టు కేసులను పరిష్కరించుకోదలచిన వ్యక్తులు తమ కేసు పూర్వాపరాలు, కావలసిన పరిష్కారం, వివరిస్తూ సంబంధిత పత్రాలు మరియు తమ అర్హతను తెలియజేసే పత్రాలతో అఫిడవిట్ దాఖలు చేసి సత్వర, ఉచిత న్యాయాన్ని కోరవచ్చు.

వివిధ స్థాయిలలో ఎవరికి దరఖాస్తు చేయాలో ఇక్కడ పేర్కొన్నాం:

**జిల్లాస్థాయిలో** – కార్యదర్శి, జిల్లా న్యాయ సేవల ప్రాధికార సంస్థ, జిల్లా కోర్టు భవనాలు.

**రాష్ట్రస్థాయిలో** – సభ్యకార్యదర్శి, రాష్ట్ర న్యాయ సేవల ప్రాధికార సంస్థ, న్యాయ సేవాసదన్, సిటీ సివిల్ కోర్టు భవనాలు, హైకోర్టు భవనాలు, హైదరాబాదు – 500 066 (లేదా)

హైకోర్టులో ఉన్న కేసులలో న్యాయ సహాయం కోరే వ్యక్తులు కార్యదర్శి, హైకోర్టు న్యాయ సేవల ప్రాధికార సంస్థ, హైకోర్టు భవనాలు, హైదరాబాదు – 500 066.

## లోక్ అదాలత్ వల్ల ప్రయోజనాలు, వివాదాల పరిష్కారం

1. ఎటువంటి కోర్టు రుసుము ఉండదు, ఒక వేళ కోర్టు రుసుము అప్పటికే చెల్లించి ఉంటే లోక్ అదాలత్‌లో కేసు పరిష్కరింపబడినప్పుడు నియమాలకు లోబడి రుసుమును తిరిగి చెల్లిస్తారు.

2. వివాదాల వేగవంత విచారణ, విధానంలో వెసులుబాటు అన్నవి లోక్ అదాలత్‌లోని ముఖ్యమైన అంశాలు. వివాదాలను లోక్ అదాలత్ పరిష్కరించే క్రమంలో పౌర విచారణ స్మృతి సాక్షాల చట్టం వంటి వాటిల్లో పేర్కొన్న విధానాలను ఖచ్చితంగా పాటించాలని లేదు.

3. తమ సలహాదారు ద్వారా వివాదంలోని కక్షిదారులు నేరుగా జడ్జితో సంభాషించవచ్చు. ఇది సాధారణ న్యాయ స్థానాల్లో సాధ్యంకాదు.

4. లోక్ అదాలత్ ఇచ్చే తీర్పును వాది, ప్రతివాదులు గౌరవించాలి. సివిల్ కోర్టు ఇచ్చే తీర్పుకి ఉండే విలువ దీనికి కూడా ఉంటుంది. వివాద అంతిమ పరిష్కారం ఆలస్యం కాకుండా ఉండటానికి దీనిపై అప్పీలును అనుమతించరు.

5. అడ్వకేట్ల ద్వారా ఉచిత న్యాయ సలహా అందిస్తారు. కోర్టులలో కేసును వాదించటానికి అడ్వకేట్లను నియమిస్తారు; ఉచిత న్యాయ సేవలు, మద్దతుకి అర్హులైన వ్యక్తులకు సంబంధించిన కోర్టు కేసులలో కోర్టు ఖర్చులను భరిస్తారు, తీర్పు నకళ్లను ఉచితంగా అందచేస్తారు.

## కీలక పదాలు

సమాచారం
అప్పిలేట్ అధికారి
రికార్డు ప్రభుత్వ అధికారి
పారదర్శకత
న్యాయసేవ
లోక్ అదాలత్
గృహ హింస
సివిల్ కేసులు
బాల నేరస్తుల గృహం
ప్రభుత్వ అధికారి

## మీ అభ్యసనాన్ని మెరుగుపరచుకోండి

1. కింది కథనం ఆధారంగా సమాచార హక్కు చట్టం నేపథ్యంలో వివిధ ప్రభుత్వ శాఖల, పౌరుల పాత్రలను వివరించండి. సమాచార హక్కు చట్టం వల్ల ప్రభుత్వ పని మరింత పారదర్శకంగా ఎలా అవుతుందో రాయండి.

   *కింద పేర్కొన్న ఘటన మెదక్ జిల్లాలోని చిన్నశంకరంపేటలో జరిగింది. స్వయం సహాయక బృందాల సభ్యులు రాష్ట్ర ప్రభుత్వ గ్రామీణ అభివృద్ధి మంత్రిత్వశాఖ పథకాలైన అభయ హస్తం, ఆమ్ ఆద్మీలలో చేరారు. ఈ పథకం కింద 9 నుంచి 12 తరగతులు చదువుతున్న పిల్లలకు 1200 రూపాయల స్కాలర్‌షిప్ పొందడానికి అర్హత ఉంది. అయితే 2008-11 మధ్య మూడు సంవత్సరాల పాటు విద్యార్థులకు స్కాలర్‌షిప్ మొత్తం అందలేదు. విద్యార్థులు ఇందిరా క్రాంతి పథం (IKP) కార్యాలయానికి వెళ్లి అడిగారు. కానీ అక్కడి అధికారులు వాళ్లను పట్టించుకోలేదు.*

   *ఇది స్థానిక దినపత్రికల దృష్టికి వచ్చింది. ఆమోదించిన స్కాలర్‌షిప్పుల వివరాలు ఇవ్వమంటూ వాళ్లు సంబంధిత అధికారుల వద్ద దరఖాస్తు చేశారు. 2008-09, 2009-10, 2010-11 సంవత్సరాలలో లబ్ధిదారుల సంఖ్య, మంజూరు చేసిన మొత్తం ఎంత అని అడిగారు. వాళ్లకు ఒక వారంలోపు సమాచారం వచ్చింది. మొత్తం ఏడు లక్షల రూపాయలు మంజూరయ్యాయి. సమాచార హక్కు ద్వారా అందిన వివరాలను బట్టి డబ్బు మంజూరయ్యింది కానీ, దానిని పంచలేదని తెలిసింది. ఈ విషయం వార్తాపత్రికలలో ప్రచురితం కాగానే 15 రోజుల లోపు 1167 విద్యార్థులకు స్కాలర్‌షిప్ అందచేశారు.*

2. సమాచార హక్కు చట్టం వల్ల ప్రభుత్వం పనిని మెరుగు పరచటం, పర్యవేక్షించటం ఎలా సాధ్యమవుతుంది?
3. సమాచారం అని దేనిని అంటారు? ఇది ప్రభుత్వ శాఖలలో ఎలా ఉత్పన్నమవుతుంది? పై అధికారి, కింది అధికారి మధ్య జరిగే మౌఖిక సంభాషణ సమాచారం అవుతుందా?
4. రాష్ట్ర, కేంద్ర సమాచార కార్యాలయాలకు స్వయంప్రతిపత్తి ఎందుకు ఇచ్చారు?
5. సమాచార హక్కు చట్టం ప్రజాస్వామ్యానికి ఉన్న అసలైన స్ఫూర్తిని తెలియచేస్తుంది. దీనిని మీరు ఎలా సమర్థిస్తారు?
6. దేశంలోని వివిధ ప్రభుత్వ శాఖలనుంచి ఏ పౌరుడికైనా సమాచారం అందుబాటులో ఉండేలా చెయ్యటానికి ఎటువంటి చర్యలు తీసుకున్నారు?
7. న్యాయ సహాయం ఆశించే ప్రజలకు న్యాయ సేవల ప్రాధాన్యత సంస్థ ఏ విధంగా దోహదపడుతుంది?
8. లోక్ అదాలత్ ఉద్దేశం ఏమిటి?
9. ఈ చట్టం కింద చేపట్టే కేసులు, ఉచిత న్యాయ సేవలు పొందటానికి పేర్కొన్న అర్హతలపై మీ అభిప్రాయం ఏమిటి?
10. గ్రామ పెద్దలు, కోర్టులు వివాదాలు/ తగాదాలను పరిష్కరించే విధానాలను పోల్చండి. మీరు దేనిని ఇష్టపడతారు, ఎందుకు?

## తెలుసుకోండి! అందరికీ తెలియజేయండి!

## మీ కుటుంబ కష్టార్జిత ధనాన్ని కాపాడుకోండి

నేటి విద్యార్థులే రేపటి పొదుపు దారులు మరియు డిపాజిటర్లు. అందువలన మన కష్టార్జిత ధనాన్ని కొన్ని వినూత్న స్కీములు మరియు ఆలోచనలతో మనల్ని మోసం చేసే వ్యక్తులకిచ్చి మోసపోకుండా ఎలా ఉండాలో నేర్చుకోవాలి. మీ కుటుంబ సభ్యులకు మరియు మీ స్నేహితులకు కూడా అటువంటి మోసగాళ్ళ వల్ల మోసపోకుండా మీరు తెలుసుకున్న విషయాలను వారికి కూడా తెలియపరచండి.

ముఖ్యంగా గుర్తుంచుకోవాల్సింది ఏమిటంటే, డబ్బు అరుదైన వస్తువు మరియు సులువుగా దొరకదు. దానిని కష్టపడి సంపాదించుకోవాలి. ఎవరైనా మన డిపాజిట్లపై సాధ్యం కాని రీతిలో అధిక రాబడి అందిస్తామంటూ ఆశ చూపితే వారు మోసపూరిత ఉద్దేశ్యాలతో మనల్ని ప్రలోభ పెడుతున్నారని మనం అర్థంచేసుకోవాలి. ఎప్పుడైతే బ్యాంకులే సాధారణ వడ్డీరేటు అందిస్తున్నప్పుడు, ఇతర వ్యక్తులు లేదా సంస్థలు అధిక వడ్డీరేట్లు ఏ విధంగా ఇవ్వగలరని మనం ఆలోచించాలి. అధిక వడ్డీ రేటుకు ఆశపడి ఒక్కసారి మన డబ్బును అటువంటి వ్యక్తులకు/ సంస్థలకు ఇస్తే ఆ డబ్బు మనకు తిరిగి వచ్చే ఆస్కారం వుండక పోవచ్చని గుర్తించాలి. ఎందుకంటేమోసగాళ్ళు ప్రజల దగ్గర నుంచి డబ్బు సేకరించి మాయమవుతారు. అందువలన ఇలా అధిక వడ్డీ రేటు ఇస్తామని లేదా అధిక రాబడి పొందొచ్చని ఆశ చూపే వ్యక్తులకు మన డబ్బును ఇవ్వకూడదు.

ప్రజల దగ్గర నుండి డిపాజిట్లు సేకరించడానికి బ్యాంకులకే కాకుండా కొన్ని నాన్–బ్యాంకింగ్ సంస్థలకు కూడా భారతీయ రిజర్వు బ్యాంకు (RBI) అనుమతినిచ్చింది. ఎవరైనా తమ ధనాన్ని అటువంటి నాన్–బ్యాంకింగ్ సంస్థలో డిపాజిట్ / జమ చేసే ముందు, ఆ సంస్థ నిజంగా ఆర్.బి.ఐ. దగ్గర నమోదైయిందో లేదో మరియు ప్రజల నుంచి డిపాజిట్లు సేకరించుటకు ప్రత్యేక అనుమతి పొందిందో లేదో నిర్ధారించుకోవాలి. అలా అనుమతిపొందిన సంస్థల పేర్లు ఆర్.బి.ఐ. వారి వెబ్‌సైట్ నందు చూపబడినవి. కొంత మంది మోసగాళ్ళు ఆర్.బి.ఐ. పత్రములు నకలు చేసి ప్రజలను మోసం చేయడం కూడా జరుగుతోంది. మనం ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలి.

అధిక రాబడి అంటే  అధిక నష్టం కూడా కలగవచ్చని మనం గ్రహించాలి. స్పెక్యులేషన్ కార్యకలాపాలతో ఖచ్చిత లాభాలు సాధ్యం కాదు. ఏ వ్యక్తీ డబ్బును ఉచితంగా ఇవ్వడు. ఇంటర్నెట్‌లో డిపాజిట్లు కోరుతూ అధిక రాబడి లేదా బహుమతులు పొందగలరంటూ ప్రామిస్ చేసే స్కీముల మాయలో మనం పడకూడదు. మల్టీలెవల్ మార్కెటింగ్ లేదా పిరమిడ్ స్ట్రక్చర్ తరహా స్కీములు మిమ్మల్ని ముందుగా కొంత డబ్బు డిపాజిట్ చేసి సభ్యునిగా చేరమంటాయి. ఆ తరువాత మీకు అధిక రాబడి లేదా వడ్డీ కావాలంటే మరికొంత మందిని సభ్యునిగా చేర్చమని అడుగుతాయి. అటువంటి స్కీముల వల్ల మోసగింపబడకుండా జాగ్రత్తగా ఉండాలి.

మనం తెల్సుకోవలసిన మరో ముఖ్యమైన విషయం ఏమిటంటే నాన్–బ్యాంకింగ్ సంస్థలలో మనం జమచేసే డిపాజిట్లకు భారతీయ రిజర్వు బ్యాంకు (ఆర్.బి.ఐ.) నుంచి కానీ భారత ప్రభుత్వం నుంచి కానీ ఏ విధమైన బీమా కానీ హామీ కానీ ఉండదు.

మీరు తెలుసుకున్న ఈ విషయాలను మీ కుటుంబ సభ్యులకు, మీ స్నేహితులకు, వారి కుటుంబాలకు కూడా తెలియపరచి మోసగాళ్ళ నించి అధికరాబడి/ వడ్డీ ఆశ చూపుతూ చేసే మోసాల నుంచి జాగ్రత్తగా ఉండమని వారిని కూడా చైతన్య వంతులను చేయండి. ఎందుకంటే ఈ రోజు మీరు తెలుసుకున్న ఈ విషయాలు వాళ్ళకు ఇప్పటి వరకు తెలిసి ఉండకపోవచ్చు కదా !

ప్రజాప్రయోజనం కోసం జారీ చేయబడినది.

**భారతీయ రిజర్వు బ్యాంకు**

**RESERVE BANK OF INDIA**

**www.rbi.org.in**




# మీకు డబ్బు ఆశచూపుతూ వచ్చే ఇమెయిల్స్/ఎస్ఎంఎస్‌లకు కాల్స్ వల్ల మీరు

# మోసపోవద్దు




మీరు లాటరీ గెలుచుకున్నారనో లేదా విదేశాల నుంచి పెద్ద ఎత్తున డబ్బు వస్తుందనో మీకు తెలియజేస్తూ ఎప్పుడైనా మీకు ఇమెయిల్/ఎస్ఎంఎస్/కాల్ అందిందా?

లేదా మీ వ్యాపారానికి తక్కువ వడ్డీకే డబ్బులు ఇస్తామంటూ ఎవరైనా మీకు తెలియజేశారా?

రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియా గవర్నరు ఫోటోతో ఉన్న లెటర్‌హెడ్ మరియు మీ కోసం ఆర్‌బిఐ వద్ద డబ్బు ఉన్నాయని, కస్టమర్ ఐడి మరియు పాస్‌వర్డ్ లాంటి మీ బ్యాంకు యొక్క ముఖ్యమైన వివరాలను అందజేస్తే లేదా కొద్దిగా డబ్బు చెల్లిస్తే ఆ మొత్తాన్ని విడుదల చేస్తామని తెలియజేస్తూ సీనియర్ ఆర్‌బిఐ అధికారి చెప్పినట్లుగా మీకు ఇమెయిల్ అందిందా?

**ఇలాంటి వాటిని నమ్మకండి. అధికారి ఎవరైనా లేదా చూడటానికి అవి ఎంత ఆకర్షణీయంగా ఉన్నాసరే, అవి నకిలీవే. ఆర్‌బిఐ ఎప్పుడూ ఇలాంటి ఇమెయిల్స్ పంపదు.**

- భారతదేశంలోని లేదా విదేశాల్లోని తెలియనివారెవ్వరికీ ప్రారంభ డిపాజిట్/కమీషన్/బదిలీ రుసుం కింద డబ్బు ఏమీ పంపవద్దు.
- మీ బ్యాంకు అకౌంట్ నంబరు/ వివరాలను లేదా మరేదైనా ఇతర సంబంధిత సమాచారాన్ని ఎవ్వరికీ ఫోన్ లేదా ఇమెయిల్ ద్వారా వెల్లడించకండి.
- ఏదైనా డబ్బు అందుతుందనే ఆశతో భారతదేశం లేదా విదేశాల్లో ఏ వ్యక్తితోనూ ఎలాంటి ఉత్తర ప్రత్యుత్తరాలు జరపవద్దు.
- ఏ వ్యక్తి/ సంస్థ/ ట్రస్టు యొక్క అకౌంట్‌లు లేదా ఫండ్స్ కూడా ఆర్‌బిఐ వద్ద ఉండవు.
- జాగ్రత్తగా ఉండవలసిందిగా మీ స్నేహితులకు/ కుటుంబ సభ్యులకు తెలియజేయండి.
- ఇలాంటి మోసపూరిత ఆఫర్‌ల విషయాన్ని సైబర్ సెల్/ ఇతర చట్టాలను అమలుజేసే ఏజెన్సీల దృష్టికి తీసుకురండి.
- మరిన్ని వివరాలకు దయచేసి ఆర్‌బిఐ వెబ్‌సైట్‌ని సందర్శించండి.

**గుర్తుంచుకోండి.. ఎవ్వరూ కూడా ఉచితంగా వేరొకరికి డబ్బు ఇవ్వరు.**

ప్రజాప్రయోజనం కోసం జారీ చేయబడినది.

**భారతీయ రిజర్వు బ్యాంకు**

**RESERVE BANK OF INDIA**

www.rbi.org.in